
చెముడులంకలో భోగి మంటలు వెలిగిస్తున్న విద్యార్థులు


అప్పనపల్లిలో సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న విద్యార్థులు


కొత్తపేట వుడయార్ శిల్పకళా ప్రాంగణంలో కళా బృందాలతో ఎంపీపీ మార్గన, శిల్పి రాజ్‌కుమార్


మలికిపురంలో భోగి కుమ్ము వద్ద మహిళల పూజలు


తాను గీసిన సంక్రాంతి చిత్రాలను ప్రదర్శిస్తున్న చిత్రకారుడు సంగీత్

క్లుప్తంగా

మా ఊరికి రండి


కలెక్టర్ శుక్లాకు భోగి దండను బహూకరిస్తున్న సర్పంచ్ రాంబాబు

ఆలమూరు: పశు పోషణలో ప్రఖ్యాతి చెందిన తమ గ్రామాన్ని భోగి పండగ నాడు సందర్శించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లాను గుమ్మిలేరు సర్పంచ్ గుణ్ణం రాంబాబు కోరారు. అమలాపురంలోని కలెక్టరేట్‌కు గురువారం వెళ్లిన ఆయన.. కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో మరెక్కడా లేని విధంగా ఉరదాలమ్మ – దండు గంగమ్మ ఆలయ కమిటీ నేతృత్వంలో కిలోమీటర్ పొడవైన భోగిదండ తయారు చేశామన్నారు. దీనికి చేపట్టే పూజా కార్యక్రమాల్లో పాల్గొనాలని కలెక్టర్‌ను సర్పంచ్ కోరారు. కలెక్టర్ శుక్లాకు సర్పంచ్ రాంబాబు భోగి దండ బహూకరించారు. తన విజ్ఞప్తికి కలెక్టర్ సానుకూలంగా స్పందించారని రాంబాబు తెలిపారు.

సంప్రదాయ రీతిలో సంక్రాంతి జరుపుకోవాలి

ఆలమూరు: సంక్రాంతి పండగను సంప్రదాయ రీతిలో, ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకూ తావు లేకుండా నిర్వహించుకోవాలని కొత్తపేట ఆర్డీఓ ఎం.ముక్కంటి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షతన సంప్రదాయబద్ధంగా సంక్రాంతి పండగ నిర్వహణపై గురువారం ఆయన సమీక్షించారు. కోడిపందాలు, గుండాట, పేకాట ఆడరాదని, వాటిని ప్రోత్సహించినా, నిర్వహించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. తెలుగుదనం ఉట్టిపడేలా సంక్రాంతి వేడుకల నిర్వహణ కు ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు. తహసీల్దార్ జి.లక్ష్మీపతి, ఎంపీడీఓ కె.జాన్‌లింకన్, రావులపాలెం సీఐ రజనీకుమార్, ఎస్సై ఎస్.శివప్రసాద్, ఈఓ పీఆర్డీ పీఆర్‌సీ రాజ్‌కుమార్, జెడ్పీటీసీ తోరాటి సీతామహాలక్ష్మి, వైస్ ఎంపీపీ వాసంశెట్టి దుర్గాభవాని పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాపాక

మలికిపురం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన 8 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు గురువారం ప్రారంభించారు. దీని ద్వారా సబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాల్లో విద్యుత్ సరఫరా మరింత మెరుగు పడుతుందని ఆయన న్నారు. ఈపీడీసీఎల్ ఏఈ సతీష్ పాల్గొన్నారు.

దట్టంగా పొగమంచు


రాజోలులో దట్టంగా అలముకున్న పొగమంచు

రాజోలు: దట్టమైన పొగమంచుతో గురువారం రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. రాజోలు – శివకోటి మధ్య జాతీయ రహదారిపై ఉదయం 10 గంటల వరకు పొగమంచు వీడకపోవడంతో వాహనచోదకులు అవస్థలు పడ్డారు.

యూటీఎఫ్ మండల అధ్యక్షునిగా ఏడుకొండలు

అంబాజీపేట: యూటీఎఫ్ మండల అధ్యక్షుడిగా పడమటి ఏడుకొండలు ఎన్నికయ్యారు. అంబాజీపేట నాగమల్లిచెట్టు వద్ద ఉన్న ప్రాథమిక పాఠశాలలో బుధవారం రాత్రి జరిగిన యూటీఎఫ్ మండల సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా పి.నారాయణమూర్తి, సహాయ అధ్యక్షులు ఎస్.రవికుమార్, సీహెచ్.శ్యామల కుమారి, ప్రధాన కార్యదర్శిగా కె.గోవిందరాజు, కోశాధికారిగా జి.రాంబాబు, మహిళా కార్యదర్శిగా ఎస్ఎన్ గంగాభవాని ఎన్నికయ్యారు.

పొన్నాడకు నివాళి

రాజోలు: ప్రముఖ న్యాయవాది పొన్నాడ హనుమంతరావు మృతి సాహితీ లోకానికి తీరని లోటని సాహితీ హేమంతం ట్రస్ట్ అధ్యక్షుడు దార్ల పెదబాబు అన్నారు. రాజోలులో సాహితీ హేమంతం ట్రస్ట్ ఆధ్వర్యాన పొన్నాడ హనుమంతరావు చిత్రపటానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కవి ఎమ్మెస్ సూర్యనారాయణ, ట్రస్ట్ సభ్యులు ఐ.సూర్యనారాయణ మూర్తి, వాగ్దేవు రమాదేవి, బిక్కిన సీతామహాలక్ష్మి, దారపురెడ్డి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే రాజోలు పట్టణ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యాన కూడా పొన్నాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

క్షయ నివారణపై అవగాహన

ఆలమూరు: క్షయ వ్యాధి నివారణపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వ్యాధిగ్రస్తులకు మెరుగైన చికిత్స అందించాలని జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ సురేష్ అన్నారు. కలవచర్ల, పెదపళ్ల గ్రామాల్లో డాక్టర్ సుజాత సౌమ్య, లీలతో కలిసి గురువారం ఆయన పర్యటించారు. క్షయ లక్షణాలు, నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. సంబంధిత రోగులకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారన్నారు. సీహెచ్ఓ పి.వెంకటరత్నం, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పల్లెపల్లెనా పండగ సందడి

- అలరించిన సంక్రాంతి సంబరాలు
- పాఠశాలల్లో విద్యార్థుల కోలాహలం

కొత్తపేట: సంక్రాంతి పండగ సమీపిస్తుండటంతో పల్లెల్లో పండగ కోలాహలం నెలకొంది. పలు గ్రామాల్లో ముందస్తు సంక్రాంతి సంబరాల కోలాహలం మిన్నంటుతోంది. కొత్తపేట శ్రీనాథ రత్నశిల్పి వుడయార్ శిల్పకళా ప్రాంగణంలో అంతర్జాతీయ శిల్పి, రోటరీ క్లబ్ అధ్యక్షుడు డి.రాజ్‌కుమార్ వుడయార్ ఆధ్వర్యాన గురువారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. శిల్పకళా ప్రాంగణమంతటా బాలికలు రంగురంగుల రంగవల్లులు తీర్చిదిద్దారు. గ్రామ దేవత బంగారమ్మ అమ్మవారి విగ్రహంతో అలంకరించిన ప్రభను ఎడ్లబండిపై ఉంచి, దాని ముందు హరిదాసులు, గంగిరెద్దులు, మేళతాళాలు, డప్పు వాయిద్యాల నడుమ గరగ నృత్యాలు, వీరనాట్యంతో మెయిన్ రోడ్డు, గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. దీంతో గ్రామంలో సంక్రాంతి వైభవం ముందస్తుగానే కనువిందు చేసింది. తిరిగి ప్రాంగణానికి చేరుకున్నాక బాలికలు శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతో అలరించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు తోట వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో జరిగిన సభలో ఎంపీపీ మార్గన గంగాధరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో సంక్రాంతి సంబరాలకు ఎంతో విశిష్టత ఉందన్నారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు ఎంపీపీ చేతుల మీదుగా వెండి గిన్నెలు, పాల్గొన్న వారందరికీ కన్సొలేషన్ బహుమతులు అందజేశారు. ఏడాది కాలంగా తన ఆటోతో మండలంలో రామనామ సంకీర్తన జరుపుతున్న దర్నాల శేఖర్‌ను ఘనంగా సత్కరించి, రూ.5 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులందరినీ కూడా సత్కరించి, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బూసి జయలక్ష్మి, బీజేపీ స్వచ్ఛభారత్ రాష్ట్ర కన్వీనర్ పాలూరి సత్యానందం, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల కళాస్రవంతి సంగీత, వాయిద్య, నృత్య కళాకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొమారిపాటి ఏసు వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అవిడి చప్పిడివారిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాల, స్థానిక విద్యా బాలమందిర్, గౌతమ్ స్కూలు తదితర పాఠశాలల్లో కూడా సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు.

చెముడులంకలో..

ఆలమూరు : చెముడులంకలోని శ్రీనేతాజీ కాన్వెంట్‌లో కరస్పాండెంట్ తుమ్మా శ్రీనివాస్ ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక, నృత్య ప్రదర్శనలు అలరించాయి. తొలుత భోగి మంటలు వేసి, ఆ ప్రాంగణాన్ని రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మలతో అలంకరించారు. హరిదాసు, భరతమాత, డూడూ బసవన్న, దేవతామూర్తుల వేషధారణలతో విద్యార్థులు అలరించారు. బొమ్మల కొలువు విశేషంగా ఆకట్టుకుంది. ముగ్గుల పోటీల విజేతలకు ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచ్ తమ్మన శ్రీనివాస్ బహుమతులు అందజేశారు.


పి.గన్నవరంలో సంక్రాంతి ప్రభను ఊరేగిస్తూ కోలాటం చేస్తున్న విద్యార్థినులు

అప్పనపల్లిలో..

మామిడికుదురు: అప్పనపల్లి విశ్వభారతి స్కూల్‌లో విద్యార్థులు భోగి మంట వెలిగించి, పిడకల దండలు వేశారు. చిన్న పిల్లలకు భోగి పండ్లు పోసి, ఆశీర్వదించారు. గొబ్బెమ్మలు పెట్టి, పాటలు పాడి సందడి చేశారు. బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. సంప్రదాయ వేషధారణలతో విద్యార్థులు అలరించారు. కరస్పాండెంట్ యర్రంశెట్టి సత్యవర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి వైభవం

పి.గన్నవరం: స్థానిక సాయితేజ విద్యాసంస్థల ఆవరణలో సంప్రదాయ దుస్తులు ధరించిన విద్యార్థులు భోగి మంటలు వేసి, నృత్యాలు చేశారు. స్కూలు నుంచి స్థానిక మూడు రోడ్ల సెంటర్ వరకూ సంక్రాంతి ప్రభను ఊరేగించారు. విద్యాసంస్థల డైరెక్టర్లు అన్నాబత్తుల అనుబాబు, రాణి, ప్రిన్సిపాల్స్ పీవీఆర్ నాయుడు, సుంకర వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు. సంక్రాంతి నేపథ్యంలో వాడవాడలా చిన్నారులు గొబ్బెమ్మలకు పూజలు చేస్తూ సందడి చేస్తున్నారు. సంక్రాంతి పాటలతో అలరిస్తున్నారు.

వైభవంగా ముందస్తు సంబరం

మలికిపురం: స్థానిక దీక్ష పాఠశాలలో జరిగిన ముందస్తు సంక్రాంతి వేడుకల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణలో అలరించారు. సంక్రాంతి సాంస్కృతిక గీతాలు ఆలపించారు. భోగి మంటలు వేసి, హరిదాసు వేషధారణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ప్రిన్సిపాల్ ఓఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు. మలికిపురానికి చెందిన సునయన ఆర్ట్స్ అకాడమీ డైరెక్టర్, ప్రముఖ చిత్రకారుడు నల్లి సంగీత్ గీచిన సంక్రాంతి చిత్రాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

అలరించిన ముగ్గుల పోటీలు

అంబాజీపేట: పసుపల్లిలో ఎఫ్ఎంసీ సంస్థ నిర్వహించిన సంక్రాంతి ముగ్గుల పోటీలు అలరించాయి. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మహిళలకు సంస్థ ఎంఐఈ సీనియర్ మేనేజర్ నారాయణ, ఎస్ఐ రమేష్, ఎండీఓ ప్రసాద్, సాయి, సర్పంచ్ మట్టపర్తి నాగరాజు బహుమతులు అందజేశారు. అంబాజీపేట ఎస్ఎస్ఎం విద్యా సంస్థల్లో కరస్పాండెంట్ ఎం.సాయిప్రసాద్, ప్రిన్సిపాల్ ఎస్.రాధామణి ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాలు నిర్వహించారు.

పేదల సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- ఎమ్మెల్యే చిట్టిబాబు
- వైవీ పాలెంలో గడప గడపకూ..


యర్రంశెట్టివారిపాలెంలో మహిళకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే చిట్టిబాబు

పి.గన్నవరం: పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు అన్నారు. బెల్లంపూడి గ్రామ సచివాలయ పరిధిలోని యర్రంశెట్టివారిపాలెంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. స్థానిక నాయకులు అప్పన త్రినాథ నాగేశ్వరరావు, మేడిది రాంబాబు, పెద్దిరెడ్డి రంగారావు, కొప్పుల సుబ్బారాయుడు, ఎ.సురేష్‌నాయుడు తదితరులతో కలిసి చిట్టిబాబు ఇంటింటికీ తిరిగి ప్రజలను కలుసుకున్నారు. సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఆయన పాలనలో ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరించారు. గ్రామస్తులు స్థానిక సమస్యలను చిట్టిబాబు దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారు నాయుడు, నాయకులు అడ్డగళ్ల వెంకట సాయిరామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుపై ప్రయాణించిన ఎమ్మెల్యే

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం అనంతరం ఇంటికి వెళ్తున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు బెల్లంపూడి నుంచి యర్రంశెట్టివారిపాలెం వరకూ ఆర్టీసీ బస్సులో ప్రయాణించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రయాణికులకు వివరించారు.

కోడిపందేలు నిర్వహిస్తే కేసులు

అంబాజీపేట: సంక్రాంతి పేరుతో కోడిపందేలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎల్.జోసఫ్, ఎంపీడీఓ ఐ.రత్నంరాజు, ఎస్సై ఎ.చైతన్యకుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో రెవెన్యూ, సచివాలయ సిబ్బందితో వారు గురువారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో కోడిపందేలు, పేకాట, గుండాట, బెల్టుషాపులు తదితర అసాంఘిక కార్యక్రమాలపై నిషేధం ఉందని, దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ నెల 16న జగ్గన్నతోటలో ప్రభల తీర్థంలో ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, ఫ్లెక్సీలు కనిపించినా కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో ఈఓ పీఆర్డీ బి.మమత తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబుకు ఎమ్మెల్యే పరామర్శ

అంబాజీపేట: చిరతపూడిలో పితృవియోగంతో బాధ పడుతున్న కడలి సత్యసాయిబాబును ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు గురువారం పరామర్శించి మనోధైర్యం కల్పించారు. పరామర్శించిన వారిలో వైస్ ఎంపీపీ నేతల నాగరాజు, తోలేటి బంగారునాయుడు, పలివెల శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఎంపీటీసీకి పలువురి పరామర్శ

మాతృ వియోగంతో బాధ పడుతున్న ఇరుసుమండ ఎంపీటీసీ సభ్యురాలు బుడితి సత్యనారాయణమ్మను ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, సొసైటీ అధ్యక్షుడు నాగాబత్తుల సత్యానందం తదితరులు పరామర్శించారు.

తెల్లదోమ నివారణకు చర్యలు

అయినవిల్లి: కొబ్బరిపై ఆశించే రూగోస్ తెల్లదోమ నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని ఉద్యాన అధికారి ఎం.బబిత, ఆత్మ ప్రాజెక్టు అధికారి జ్యోతిర్మయి సూచించారు. తెల్లదోమ నివారణ చర్యలపై శానపల్లిలంకలో ఉద్యాన శాఖ, ఆత్మ సౌజన్యంతో గురువారం రైతులకు అవగాహన కల్పించారు. బబిత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెల్లదోమ నివారణ చర్యలను జ్యోతిర్మయి వివరించారు. తెల్లదోమ నివారణకు బదనికలను ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు.

లక్ష్మీనరసింహుని సన్నిధిలో విప్ సామినేని


విప్ సామినేనికి స్వామి చిత్రపటం ఇస్తున్న సత్యనారాయణ

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను కుటుంబ సమేతంగా గురువారం సందర్శించారు. స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు అర్చకులు, సిబ్బంది ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పూజల అనంతరం వారిని అర్చకులు ఆశీర్వదించారు. స్వామి వారి చిత్రపటం, ప్రసాదాన్ని అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ అందజేశారు.

ఆత్మీయంగా కలుసుకుని.. ఆనందం పంచుకుని..

- ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు
- నాటి గురువులకు సత్కారాలు

కొత్తపేట: చిన్ననాడు పాఠశాలల్లో గడిపిన క్షణాలను.. అల్లరి చేష్టలను.. ఉపాధ్యాయులు నేర్పిన క్రమశిక్షణను.. వారు నేర్పిన చదువుతో జీవితంలో స్థిరపడిన గమనాన్ని గుర్తు చేసుకుంటూ ఆ పూర్వ విద్యార్థులు ఆత్మీయానందానుభూతికి లోనయ్యారు. పలు ప్రాంతాల్లో గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ఘనంగా నిర్వహించారు. కొత్తపేట మండలం వాడపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1995–98 సంవత్సరాల్లో 7 నుంచి 10వ తరగతి చదువుకున్న విద్యార్థులు కలుసుకున్నారు. ఆ పాఠశాలలో చదువుకుని ఉద్యోగులుగా, వ్యాపారులుగా, రాజకీయ నాయకులుగా ఎదిగి, స్థానిక, స్థానికేతర ప్రాంతాల్లో స్థిరపడిన వారందరూ 25 సంవత్సరాల తరువాత కలుసుకుని, పరస్పర పలకరింపులతో ఆనందానుభూతికి లోనయ్యారు. తమకు చదువు చెప్పి, ప్రయోజకులుగా తీర్చిదిద్దిన గురువులకు హృదయపూర్వకంగా నమస్కరించారు. పలువురికి పాదాభివందనం చేసి గౌరవంగా ఆహ్వానించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉల్లాసంగా.. ఉత్సాహంగా గడిపారు. పూర్వ విద్యార్థి బండారు రాజేష్, పలువురు పూర్వ విద్యార్థుల ఆధ్వర్యాన అప్పటి హెచ్ఎం అజ్జరపు శ్రీరాములు అధ్యక్షతన జరిగిన సభలో నాటి తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. నాటి గురువులను పూలమాలలు, శాలువాలు, నూతన వస్త్రాలతో ఘనంగా సత్కరించారు. అందరూ గ్రూప్ ఫొటో దిగారు.

ఆలమూరు ప్రభుత్వ పాఠశాలలో..

ఆలమూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1985–86 బ్యాచ్‌కు చెందిన 84 మంది విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దేశం నలుమూలల నుంచి వచ్చిన నాటి విద్యార్థులు.. ప్రస్తుత హోదాలను మరచి, ఆత్మీయత.. ఆప్యాయతతో ఆలింగనాలు చేసుకుంటూ పరస్పరం పలకరించుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను, చిలిపి అల్లరిని గుర్తు చేసుకుని, ప్రస్తుతం చేస్తున్న వృత్తి, ఉద్యోగాలను, వ్యాపారాలను వివరించారు. కొంతమంది ఉద్వేగానికి గురయ్యారు. తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులు కేవీ జోగన్న, పి.కామేశ్వరరావు, ఎన్.నరసింహమూర్తి, ఏడుకొండలు, దేశాల్, దేవుళ్లు, రమణమూర్తి, జేవీ సోమయాజులు, అటెండర్ పిల్లి బూరయ్యలను ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి తోడ్పాటు అందిస్తామని హామీ ఇచ్చారు.

గుర్తుకొస్తున్నాయి..

ఆత్రేయపురం: స్థానిక మహాత్మాగాంధీ హైస్కూల్‌లో 1988–89 పదో తరగతి విద్యార్థులు సుమారు 60 మంది అదే హైస్కూల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. నాటి విద్యార్థుల్లో పలువురు వైద్యులుగా, ఇంజినీర్లుగా, సాఫ్ట్‌వేర్ నిపుణులుగా, కీలక ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగులుగా, వ్యాపారులుగా, ప్రవాసాంధ్రులుగా ప్రస్తుతం జీవనం సాగిస్తున్నారు. వీరందరూ ఆ స్కూలులో కలుసుకొని, కష్టసుఖాలను కలబోసుకున్నారు. నాడు తమకు చదువు చెప్పిన ప్రిన్సిపాల్ వి.సత్యనారాయణమూర్తి, ఉపాధ్యాయులు మంతెన ఆనందరాజు, నంబూరి సత్యనారాయణరాజు (మురళి), పెద్దాచార్యులు, చిన్నాచార్యులు, కల్లేపల్లి సత్యానారాయణరాజు, ఎన్‌సీ సీతాదేవి, లక్ష్మీబాయ్, నంబూరి రవిరాజు, శ్రీనివాసరాజు తదితరులను ఘనంగా సత్కరించారు. కరస్పాండెంట్, సెక్రటరీ పీఎస్ రాజు తదితరులు పాల్గొన్నారు.


అలమూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో...


ఆత్రేయపురం మహాత్మాగాంధీ హైస్కూలులో..

జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ..

సఖినేటిపల్లి: స్థానిక లూథరన్ ఉన్నత పాఠశాల 1995 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పరస్పరం యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకున్నారు. కరస్పాండెంట్ నల్లి ప్రేమానందం, హెచ్ఎం జి.రమేష్‌బాబు, నాటి బ్యాచ్ విద్యార్థులు కె.జాన్‌మోజెస్, సువర్ణరత్నం, మూర్తి, అనిల్, రూప తదితరులు పాల్గొన్నారు.


వాడపాలెం ఉన్నత పాఠశాలలో నాటి గురువులతో పూర్వ విద్యార్థులు


సఖినేటిపల్లి లూథరన్ ఉన్నత పాఠశాలలో..

వివేకానందుని స్ఫూర్తితో ముందుకు సాగాలి

- ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి
- యువతకు వక్తల పిలుపు
- ఘనంగా జాతీయ యువజనోత్సవం

కొత్తపేట: స్వామి వివేకానందుని స్ఫూర్తితో యువత ముందుకు సాగాలని వక్తలు పిలుపునిచ్చారు. వివేకానందుని జయంతి సందర్భంగా పలు ప్రాంతాల్లో గురువారం జాతీయ యువజనోత్సవం ఘనంగా నిర్వహించారు. కొత్తపేట వుడయార్ ఫైన్ ఆర్ట్స్ శిల్పకళా ప్రాంగణంలో అంతర్జాతీయ శిల్పి డి.రాజ్‌కుమార్ వుడయార్ ఆధ్వర్యాన శిల్పా గార్డెన్‌లో వివేకానందుని విగ్రహానికి శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ రెడ్డి సుబ్రహ్మణ్యం, ఎంపీపీ గంగాధరరావు తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వివేకానందుని బోధనలను ఆదర్శంగా తీసుకుని యువత ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఎంపీపీ మార్గన పిలుపునిచ్చారు. సర్పంచ్ బూసి జయలక్ష్మి, బీజేపీ స్వచ్ఛభారత్ రాష్ట్ర కన్వీనర్ పాలూరి సత్యానందం, డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ్‌కుమార్, ఉప సర్పంచ్ కంఠంశెట్టి శ్రీనివాసరావు, మండల వినియోగదారుల సంఘం అధ్యక్షుడు సత్తిరాజు ఆదిత్య కిరణ్ తదితరులు పాల్గొన్నారు. వాడపాలెంలో జిల్లా యువజన సంఘాల సమాఖ్య అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు ఆధ్వర్యాన బాలలకు వివిధ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ పీఓ ఎస్.అరుణ్‌కుమార్ ఆధ్వర్యాన వివేకానంద జయంతి, జాతీయ యువజన దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

అప్పనపల్లిలో..

మామిడికుదురు: అప్పనపల్లి కళావేదికలోని వివేకానందుని విగ్రహానికి కంకిపాటి సూర్యారావు, ఆదిలక్ష్మీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కంకిపాటి వెంకటేశ్వరరావు, పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆ మహనీయుని సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో తులా నాగరాజు, చొల్లంగి శ్రీనివాస్, నల్లా యోగానంద్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందునికి నివాళి

మలికిపురం: స్థానిక ఎంవీఎస్ జేఎస్ అండ్ ఆర్‌వీఆర్ ప్రభుత్వ ఎయిడెడ్ డిగ్రీ కళాశాలలో వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అంతర్వేది వశిష్ఠాశమం స్వామీజీ కలిదిండి వరప్రసాదరాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. వక్తృత్వ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కరస్పాండెంట్ మంగెన వెంకట సత్యనారాయణమూర్తి, ప్రిన్సిపాల్ తోరం సతీష్, నక్కా రమేష్‌బాబు, డాక్టర్ బాబ్జీ, కలిదిండి దేవిక కృష్ణసాయి తదితరులు పాల్గొన్నారు. విశ్వేశ్వరాయపురం వివేకానంద పాఠశాలలో వివేకానందుని చిత్రపటానికి ప్రిన్సిపాల్ పీవీ వరప్రసాద్ పూలమాల వేశారు. వివేకానందుని బోధనలు దేశాన్ని ఉన్నత స్థానంలో నిలిపాయని అన్నారు. అధ్యాపకుడు నక్కా రమేష్‌బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేదునూరులో..

అయినవిల్లి: నేదునూరులో రావి ఫౌండేషన్, స్వామి వివేకానంద యువత ఆధ్వర్యాన జరిగిన వివేకానంద జయంతి సభలో పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వాలీబాల్ పోటీ విజేత పి.గన్నవరం నియోజకవర్గ జట్టుకు ఎమ్మెల్యే చిట్టిబాబు చేతుల మీదుగా కప్, రూ.10 వేల నగదు బహుమతి అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన కొత్తపేట నియోజకవర్గ జట్టుకు రూ.5 వేల నగదు అందజేశారు. కంప్యూటర్ విద్య నేర్చుకున్న విద్యార్థులకు సరిఫికెట్లు, వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి పి.వెంకటకృష్ణ, నిర్వాహకులు ఎం.రెడ్డి, ఆర్.బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మమే ప్రపంచ దేశాలకు దిక్సూచి

అంబాజీపేట: భారతీయ సనాతన ధర్మమే ప్రపంచ దేశాలకు దిక్సూచి అని స్వామి వివేకానంద చాటి చెప్పారని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అమలాపురం అధ్యక్షుడు, రోహిణీ ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ వీఎస్ఎన్ మూర్తి అన్నారు. కొర్లపాటివారిపాలెంలో భగవాన్ శ్రీ సత్యసాయి మందిరంలో అరిగెల కృష్ణమూర్తి ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అరిగెల బలరామమూర్తి ఆధ్వర్యాన వివేకానంద జయంతి నిర్వహించారు. అంతకు ముందు ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బొంతు పెదబాబు, బీవీవీ సత్యనారాయణ, అరిగెల జమ్మీ తదితరులు పాల్గొన్నారు.

మన సంస్కృతిని ప్రపంచానికి చాటిన ఘనుడు

పి.గన్నవరం: భారతదేశ సంస్కృతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన ఘనత స్వామి వివేకానందునికే దక్కిందని వివేకానంద యూత్ అసోషియేషన్ అధ్యక్షుడు బొరుసు చంద్రశేఖర్ అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ ఆధ్వర్యాన వివేకానందుని జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ గూటం శ్రీనివాసరావు, ఆర్ఎస్ఎస్ ప్రతినిధులు గన్నవరపు అమ్మిరాజు, జి.అంజనీ శ్రీనివాస్, సాయితేజ ప్రిన్సిపాల్ సుంకర వెంకటకృష్ణ పాల్గొన్నారు.

జొన్నాడలో..

ఆలమూరు: భారతీయ సంస్కృతిని ప్రపంచానికి చాటి చెప్పిన బహుముఖ ప్రజ్ఞాశాలి స్వామి వివేకానందుడని సర్పంచ్ కట్టా శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గొలుగూరి అప్పారెడ్డి అన్నారు. జొన్నాడలో స్థానిక వివేకానంద విగ్రహం వద్ద దొరబాబు యువశక్తి సంఘం అధ్యక్షుడు నల్లమిల్లి రామారెడ్డి ఆధ్వర్యాన వివేకానందుని జయంతి ఘనంగా జరిగింది. తొలుత ఆయన విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి, ఘన నివాళి అర్పించారు. వృద్ధులకు, మహిళలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.


కొత్తపేటలో వివేకానందునికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ గంగాధరరావు, శిల్పి రాజ్‌కుమార్ తదితరులు